అక్క చెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

- వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం
- నియోజకవర్గానికి 4 విడతలుగా రూ.151.56 కోట్లు నిధులు విడుదల
- 4,649 సంఘాల రుణ మాఫీపై హర్షం


పట్టణ పొదుపు సంఘాలకు నమూనా నగదు చెక్కు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)

సత్తెనపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా.. నాలుగున్నరేళ్లుగా నవరత్నాల సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ముఖ్యంగా వైఎస్సార్ ఆసరా పథకం పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. ఈ పథకం కింద 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా సభ్యుల అవుట్ స్టాండింగ్ బ్యాంకు రుణాలను నాలుగు వాయిదాలలో రీయింబర్స్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు విడతల్లో రుణమాఫీ నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసింది. ఈ ఏడాది నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల అనంతపురం జిల్లా ఉరవకొండ బహిరంగ సభ నుంచి ప్రారంభించారు.

నియోజకవర్గానికి రూ.151.56 కోట్లు..

సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 46,049 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిల్లో 46,490 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి సంబంధించి 2019 ఎన్నికల సమయం నాటికి బ్యాంకుల్లో ఉన్న అప్పులు మొత్తాన్ని నాలుగు విడతల్లో రూ.151.56 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.

చంద్రబాబు హయాంలో దగా...

డ్వాక్రా రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు సీఎంగా ఆ హామీని నిలబెట్టుకోకుండా మహిళలకు మొండి చెయ్యి చూపారు.

నాలుగు విడతల్లో నియోజకవర్గానికి లబ్ధి ఇలా..

మండలం	స్వయం సహాయక సంఘాలు	లబ్ధి మొత్తం కోట్లలో(రూ.)
సత్తెనపల్లి టౌన్	772	22.73
సత్తెనపల్లి రూరల్	1,318	43.66
ముప్పాళ్ళ	783	28.41
రాజుపాలెం	721	22.77
నకరికల్లు	1,055	33.99
మొత్తం	4,649	151.56

2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మి బ్యాంకు రుణాలు చెల్లించని ఎందరో డ్వాక్రా మహిళలు డీఫాల్టర్లుగా మారిపోయారు. దీంతో డ్వాక్రా సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి.

సీఎం జగన్ పాలనలో పెరిగిన పరపతి...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా సంఘాలు మళ్లీ బలం పుంజుకున్నాయి. వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడి తమ పరపతిని పెంచుకున్నాయి. ప్రభుత్వ సహకారానికి తోడుగా బ్యాంకర్లు కూడా మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నారు. అంతేకాక ఆర్థిక లావాదేవీల నిర్వహణ, జీవనోపాధికి మెరుగుపై డ్వాక్రా మహిళలను చైతన్య పరుస్తున్నారు.

మా సంఘానికి రూ.5.80 లక్షల లబ్ధి



నాగార్జుననగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నాను. ఎన్నికలకు ముందు చెప్పినట్లు ఇప్పటికి మూడు విడతలుగా వైఎస్సార్ ఆసరా నగదు బ్యాంకు ఖాతాల్లో వేశారు. ఇప్పుడు నాలుగో విడత నగదు కూడా విడుదల చేశారు. మొత్తం రూ.5.80 లక్షలు మా సంఘానికి లబ్ధి చేకూరింది.

– పల్లపు వనజాక్షి, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

మాట నిలబెట్టుకున్న జగన్



వినీల మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉంటున్నాను. అప్పట్లో తీసుకున్న రుణంలో కొంత తీర్చగా మిగిలిన రుణం తీర్చలేకపోయాం. సీఎం వైఎస్ జగన్ మాట ప్రకారం రూ.47,852 మా ఖాతాలో జమ చేశారు. మాట నిలబెట్టుకున్న సీఎంకు తోడుగా ఉంటాం.

– గుజ్జర్లపూడి ప్రభావతి, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

ప్రభుత్వం అండగా నిలిచింది



నేను యాసిన్ మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నా. మా సంఘానికి సంబంధించి రూ.7,07,262 బకాయి ఉంది. ఈ మొత్తం నాలుగు విడతలుగా ప్రభుత్వం జమ చేసింది. దీంతో బకాయిలు తీరిపోయాయి. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అన్ని విధాల అండగా నిలిచింది.

– రహీం జానీ, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా



ఉషోదయ మహిళా పొదుపు సంఘం లో సభ్యురాలుగా ఉంటున్నాను. గతంలో రూ.9,04,110 మా సంఘం సభ్యులందరం కలిసి రుణం తీసుకున్నాం . ఆ రుణం చెల్లించ లేకపోయాం. నాలుగేళ్లలో ఒక్కో మహిళలకు రూ. 90,411 చొప్పున 9,04,110 మా గ్రూపు ఖాతాలో జమయ్యాయి.

– పల్లెపోగు అమృతమ్మ, డ్వాక్రా మహిళ, సత్తెనపల్లి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధులుకండి

– సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ


మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ, పక్కన ఎంపీడీఓ జగదీష్

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సంసిద్ధులుగా ఉండాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీ కృష్ణ సూచించారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బూత్ లెవెల్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.జగదీష్ అధ్యక్షత వహించారు. ఆర్డీఓ మురళీ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు మరుగుదొడ్లు, ఫర్నీచర్, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, దివ్యాంగులు, వృద్ధులకు ర్యాంపులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వసతులు ఉన్నాయో లేవో క్షుణ్ణంగా పరిశీలించి, నివేదిక ఇవ్వాలన్నారు. తొలగింపు ఓట్ల విషయంలో పక్కా ఆధారాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. కొత్త ఓటు 18 సంవత్సరాలు నిండిన వ్యక్తికి మాత్రమే కల్పించాలని, అంతకు మించి వయసు ఉన్న వారికి ఓటు లేకపోయినప్పటికీ కొత్త ఓటు కల్పించకూడదన్నారు. వారికి ఓటు హక్కు ఎక్కడుందో క్షుణ్ణంగా పరిశీలించి, బదిలీ చేయాలే తప్ప కొత్త ఓట్లను కల్పించరాదన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో జీరో డోర్ నంబర్లతో ఉన్న ఓట్లు, తదితర వాటిపై దిశా నిర్దేశం చేశారు. బీఎల్వోల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు రాజేంద్రప్రసాద్, ఎలక్షన్ విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, బీఎల్వోలు ఉన్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న లారీ



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామ సమీపంలో ఓ లారీ ఢీకొట్టడంతో చెట్టు రహదారికి అడ్డంగా పడిపోయింది. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. నరసరావుపేట నుంచి వస్తున్న లారీ తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో డ్రైవర్ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో చెట్టు పూర్తిగా విరిగి నరసరావుపేట–సత్తెనపల్లి ప్రధాన రహదారిపై అడ్డుగా పడింది. గమనించిన స్థానికులు చెట్టును తొలగించి, రాకపోకలు పునరుద్ధరించారు. ఈ ఘటనలో లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. లారీలో ప్రయాణిస్తున్న వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు.

పట్టల పంపిణీ



రాజుపాలెం: గణపవరం బుడగ జంగాల కాలనీలోని కుటుంబాలకు డీబీఆర్సీ కో–ఆర్డినేటర్ గడ్డిపట్టి కోటిరత్నం ఆధ్వర్యంలో పట్టలను ఉచితంగా శనివారం అందజేశారు. మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న తొమ్మిది ఇళ్లకు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మాజీ సర్పంచ్ వెంకటరమణ బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఒంగూరు రమేష్ పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన కమిషనర్ షమ్మి



సత్తెనపల్లి: గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిగా వచ్చిన వి.మురళి కృష్ణను శనివారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

70 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నకరికల్లు: స్వచ్ఛంద సేవా సంస్థల వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమాజ సేవకుడు సంగుల మల్లికార్జునరావు అన్నారు. స్థానిక సరస్వతీ శిశుమందిర్ ప్రాంగణంలో నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా కంటి పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీఎఫ్ పరీక్షలు చేశారు. 70 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వరం

సత్తెనపల్లి: పేద వర్గాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వరమని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ అన్నారు. పట్టణంలోని 3, 11వ సచివాలయాల పరిధిలో శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నాగూర్ మీరాన్, 20వ వార్డు కౌన్సిలర్ కుకుట్ల లక్ష్మీ వేర్వేరుగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ నాగూర్ మీరాన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీతో పేద వర్గాలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



బెల్లంకొండ: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయిలో శనివారం నరసరావుపేటలో జరిగిన క్రికెట్ పోటీల్లో మాచాయపాలెం జట్టు రన్నర్‌గా నిలిచింది. గ్రామానికి వచ్చిన క్రీడాకారులను ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. కానుకమాత తిరునాళ్లకు కుటుంబంతో వచ్చిన చిరువ్యాపారి మిర్యాల శివ ప్రధాన రహదారి వెంబడి పిల్లలతో కలిసి ఉన్న సమయంలో గుర్తుతెలియని ఓ వాహనం వేగంగా వచ్చి వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మిర్యాల శివతో బాటు రాధిక, కర్తయ్య, ప్రిన్స్ బాబు అనే ముగ్గురు చిన్నారులకు గాయాలు కాగా వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

'ఏరియా వైద్యశాల' డైరెక్టర్ రామకృష్ణకు సన్మానం


రామకృష్ణకు సన్మాన పత్రం అందిస్తున్న డాక్టర్ రంగారావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలోనే సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ప్రథమ స్థానంలో ఉందని, అందుకు ముఖ్య కారణం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బీవీ రంగారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా వైద్యులు, సిబ్బంది శనివారం అభినందన సభ నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపురావడానికి రామకృష్ణ తనదైన ముద్ర వేశారన్నారు. కొత్త రామకృష్ణ దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మాన పత్రాన్ని అందజేశారు. వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలి


ముప్పాళ్ళలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీవో వి.మురళీకృష్ణ

ముప్పాళ్ళ: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న నవరత్నాల్లో భాగంగా ఇళ్ల స్థలాల పట్టాదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ ఆదేశించారు. మండలంలోని మాదల, ముప్పాళ్ళ గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. పట్టా ఇచ్చిన ప్రతి లబ్ధిదారునికి సంబంధిత గ్రామ సచివాలయంలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయటం జరుగుతుందన్నారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి అందరికీ పత్రాలు అందించాలని సూచించారు. మండలంలో మొత్తం 365 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 81 మందికి ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు కపిల్‌దేవ్, పవన్ కుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో జరిగే ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి పార్టీ మండలాధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు తమ పరిధిలో ఓటరు జాబితాలను సరిచూసుకుని అందులోని తప్పొప్పులను గుర్తించాలన్నారు. పార్టీ కార్యకర్తలు పోలింగ్ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అనేక కుతంత్రాలకు పాల్పడే అవకాశం ఉందని, వాటిని తిప్పికొట్టేందుకు సమైక్యంగా పోరాడాలన్నారు. జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, మాజీ ఎంపీపీ వెంపా జ్యాలాలక్ష్మీ నరసింహరావు, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, నంబూరు బాబురావు, అళ్ళ శ్రీనివాసరెడ్డి, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం


మాచాయపాలెంలో హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాలు

బెల్లంకొండ: వన్నాయపాలెం, మాచాయపాలెం, పాపాయపాలెం, మన్నెసుల్తాన్ పాలెం గ్రామాల్లో రూ. 5.45 కోట్ల అభివృద్ధి పనులను ఆదివారం పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించనున్నారు. వన్నాయపాలెంలో రూ. 35 లక్షలతో కమ్యూనిటీ హాలు, మాచాయపాలెంలో రూ. 22 లక్షలతో ఆర్బీకే భవనం, రూ. 23 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనం, రూ.29 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ. 35 లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ. 34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. పాపాయపాలెం రూ. 1.35 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 21 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనం, రూ. 25 లక్షలతో హెల్త్ క్లీనిక్ భవనం, రూ. 35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. మన్నెసుల్తాన్‌పాలెంలో రూ. 44 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం , రూ. 22 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, రూ. 26 లక్షలతో రైతు భరోసా కేంద్రం, నాడు –నేడు పథకం కింద రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీని, రూ. 16 లక్షలతోనిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు.

ఘర్షణపై కేసు నమోదు

ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలో ఇంటి వద్ద జరిగిన చిన్నపాటి వివాదంలో మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.హజరతయ్య శనివారం తెలిపారు. గ్రామంలోని అన్నపురెడ్డి రామలింగారెడ్డి, మేకల అంజిరెడ్డి ఇళ్ల వద్ద మురుగు కాల్వ విషయంలో వివాదం నెలకొందని తెలిపారు. అడ్డుగా వెళ్లిన రామలింగారెడ్డి భార్య నాగలక్ష్మిపై అంజిరెడ్డి ఇనుప రాడ్డుతో తలపై కొట్టడంతో ఆమె తలకు గాయమైనట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారని, నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హజరతయ్య తెలిపారు.

క్రికెట్ క్రీడాకారుడికి అభినందన


విద్యార్థి నజీర్‌తో ఉపాధ్యాయులు

క్రోసూరు: క్రోసూరు జెడ్పీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి షేక్ నజీర్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో ఉత్తమ కనబరిచాడని పాఠశాల హెచ్ఎం జి.రామాంజనేయులు శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్ 17 అంతరజిల్లా క్రికెట్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్య వహించి, తృతీయ స్థానంలో జట్టు నిలిచేలా కృషి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు నజీర్‌ను అభినందించారు.

దొడ్లేరు పాఠశాలకు రూ.5లక్షల నిధులు



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో క్రీడా మైదానం అభివృద్ధికి సమగ్ర శిక్ష అభియాన్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు సమగ్రశిక్ష అభియాన్ ఏఈ అనుముల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. క్రికెట్, వాలీ బాల్, ఖోఖో గ్రౌండ్‌లు అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడితో ఆట స్థలాల నిర్మాణాలకు అంచనాలు వేసినట్లు ఏఈ తెలిపారు.

కిరాణా దుకాణం దగ్ధం

పెరికపాడు(క్రోసూరు): పెరికపాడు గ్రామంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి మందా లిలియమ్మకు చెందిన కిరాణా దుకాణం దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50 వేలు విలువైన సరుకులు కాలి బూడదైనట్లు బాధితురాలు తెలిపింది.

మెరుగైన పాలన అందించాం..మళ్లీ ఆశీర్వదించండి

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే తాపత్రయంతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని, తమ ఆశీస్సులు మరలా ప్రజలు అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నార్నెపాడు గ్రామంలో రూ.81.88లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పేదల ప్రభుత్వమని, ప్రజలకు మేలు చేయాలనే తాపత్రయంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించుకుందామని మంత్రి పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి వైఎస్ జగన్ అయితే.. రైతులను ఆర్థికంగా సర్వనాశనం చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని అన్నారు. వందమంది చంద్రబాబులు, వెయ్యి మంది పవన్ కల్యాణ్‌లు కలిసి వచ్చినా ప్రజలందరి ఆశీస్సులు ఉన్నంత కాలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. వైఎస్సార్ కుటుంబానికి విధేయుడు అంబటి రాంబాబు అని, అధికారం కోసం, పదవుల కోసం వెంపర్లాడే వ్యక్తిని కాదని మంత్రి అన్నారు. తన ఓటమి కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి తనపై తమ వాడినే పోటీకి నిలబెట్టాయన్నారు. గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, సత్తెనపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏసమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఎంజేఎం రామలింగారెడ్డి, సచివాలయ మండల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లగడపాడులో లేగ దూడల ప్రదర్శన


లేగ దూడల ప్రదర్శనలో అధికారులు, రైతులు

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, జాతీయ కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ కార్యనిర్వహణాధికారి డాక్టర్ బాల శంకర్, ఉప సంచాలకులు డాక్టర్ రామారావు, సహాయ సంచాలకులు నరసింహులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పశువులకు కృత్రిమ గర్భధారణపై అవగాహన కల్పించారు. అనంతరం లేగ దూడల అందాల పోటీలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 50 లేగ దూడలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి స్వాతికి చెందిన లేగదూడ, రెండవ బహుమతి కట్టా నాగేశ్వరరావు లేగ దూడ, మూడవ బహుమతి ఇంటూరి వందనం లేగదూడ గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు డాక్టర్ శివ సారథి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు.


కొండంత అండ ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- బాధితులకు రూ.5.50 లక్షల చెక్కులు పంపిణీ


నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండ అని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఆయన శనివారం అందజేశారు. పెదకూరపాడుకు చెందిన మలినేని నాగేశ్వరరావుకు రూ.1.30లక్షలు, రామాపురం గ్రామానికి చెందిన బంకా కిషోర్ బాబుకు రూ.2.20 లక్షలు, కాశిపాడు గ్రామానికి చెందిన కొట్టంశెట్టి సతీష్ కుమార్‌కు రూ.90వేలు, క్రోసూరు మండల ఊటుకూరు గ్రామానికి చెందిన పెరికల మేరి వేద కుమారికి రూ.1.70 లక్షల నగదు చెక్కులను పంపిణీ చేశారు.

వేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం



క్రోసూరు: మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని 18 పంచాయతీల్లో జగన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. క్రోసూరు–1, క్రోసూరు–2 సచివాలయాల్లో లబ్ధిదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి సబ్ రిజిస్ట్రార్ హోదాల్లో డిజిటల్ అసిస్టెంట్ ప్రకియ జరుపుతున్నారు. రోజుకు 30 నుంచి 40 వరకు రిజిస్ట్రేషన్లు చేస్తామని, ఆదివారం కూడా రిజిస్ట్రేషన ప్రక్రియ జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి పంతులు నాయక్ తెలిపారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊటుకూరు సచివాలయ భవనం, జగనన్న కాలనీలో నూతంగా నిర్మించిన మసీదు, గుడిపాడు సచివాలయ భవనం, పీసపాడు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే భవనాలు ప్రారంభిస్తారని తెలిపారు.